# ప్రేమకి చోటులేదా!

నువ్వెప్పుడన్నా గమనించావో లేదోగాని, మార్కెట్‌కు పోయిన ప్రతీ ఆదివారం నేను చూస్తూనేవున్నా- చారెడేసి కళ్ళతో, పూర్తిగా అణగారని పాత అందపు చిహ్నాలతో గౌరవ కుటుంబపు లక్షణాలతో మధ్యవయస్సుగల ఆడది చేపల్ని అమ్ముతుండడం. ఒకవేళ నీలాటివాళ్ళని ఆమె మొహం ఒకనిమిషం ఆకర్షించినా ఏదో పూర్వజన్మ సుకృతం వల్ల అల్లా అందంగా పుట్టి వుంటుంది, అని లోపలే అనుకొని, ఆసంఘటనని వెంటనే మర్చిపోతారు.

అవునా! నన్నుమాత్రం ఆకళ్ళు ప్రతీవారం కొంతసేపు ఆకర్షించి మరి ఒదిలిపెట్టాయి.

అందుకనే ఓసారి బయల్దేరాను.

సాయంత్రం కనుచీకటి పడింది. పున్నమి వెన్నెల ప్రపంచానికి చల్లని కాంతి నిస్తోంది. చలికాలపు పొగమంచు కొంచెంగా చలిదేశపు వాతావరణాన్ని కల్పిస్తోంది. అప్పుడే దారిలో నిలబడ్డాను.

చేపలబుట్ట నెత్తినపెట్టుకుని ఆమనిషి యింటికి వెడుతోంది. అనాలోచితంగా వెంబడించాను.

ఊరిబయట పూరిగుడిసెదగ్గర ఆగింది. లోపలికిపోయి, బుట్టకింద పెట్టుకుని, బయటికి వొచ్చి ఒకసారిజుట్టు ముడివిదిలించింది. పెనుచీకట్లలా నల్లతాచుల్లా ఉండేజుట్టు పాయల్ని మళ్ళీముడివేసుకుంది. బయట ఉన్న పొయ్యి అంటించింది. ఒక కుండలో బియ్యం తెచ్చుకుని కడిగి పొయ్యిమీద బెట్టి నిప్పుని జోరుగా విసిరి మంటచెయ్యసాగింది. ఆ వెలుగులో అంతసేపటిదాకా వేపచెట్టుకింద నించున్న నన్ను చూసి ఉలిక్కిపడి మళ్ళీసర్దుకుని నా దగ్గరగా వొచ్చింది. ఒకనిమిషం పరకాయించి నిలువునా చూసింది. నాగుండెలు వేగంగా కొట్టుకో సాగాయి.

"ఎవరబ్బాయ్ నువ్వు?"

'అవును! మాట ఎంత విస్పష్టం!! నేననుకున్న మాట నిజమే నన్నమాట. ఏదో పెద్దకథ ఉండి ఉంటుంది వెనకాల' అనుకున్నాను.

"ఎవరూలేదు. నేనో జర్నలిస్టుని" అన్నాను వేపపుల్ల విరుస్తూ.

"అంటే"

"ఆ! ఎదో నాలుగు కథలు పత్రికల్లో రాసుకొనేవాడ్ని"

"కథలా!" చప్పరించి అనసాగింది. "అవును కథలు... నేనూ చదివాను చాలా కథలు. అసలు కథలకీ, జీవితానికీ సంబంధం ఉండదు. వాస్తవికాన్ని చిత్రించగలవి ఏ ఒకటో రెండో - అంతే తక్కినవన్నీ అసంభవాలు, ప్రజల్ని మోసగించేవి"

తనలోనే గొణుక్కుంటున్నట్టు అంటూ వెళ్ళి పొయ్యిదగ్గరకూచుని రాజేసుకోసాగింది.

నాకేం పాలుపోలేదు. మెల్లిగా వెళ్ళి ఎదురున్న రాయిమీద కూచున్నాను మొండిధైర్యంతో.

నాకేసి ఓరగాచూస్తూ నవ్వింది. ఆ నవ్వు ఆమె యౌవ్వనాన్ని జ్ఞాపకం చేశాయి నాకు. పెద్ద వేళ్ళు చంద్రకాంతిలో వింతగా మెరుస్తున్నాయి.

"నన్ను చూస్తుంటే నవ్వుగా ఉందా?" అన్న! కథ మొదలు పెడదామనుకుని.

"నిన్ను చూస్తేకాదు - నీ చిన్నతనం చూస్తుంటేను" అని కొంటెగా చూసి నవ్వింది. నాకు అర్థమయిందికాని-

'చిన్నతనమేమిటి?' అన్న సంభాషణపాటిస్తూ.

"అదికాదు! నాకంటె పది పదిహేనునేళ్ళు చిన్నవాడిలా ఉన్నావు - అయినా ఈ పల్లెదానితో ఏమిటి?" వింతగా నవ్విందిమళ్ళా. ఆ నవ్వులో నిరాశా, మొండితనం, జీవితాన్ని తేలిగ్గా చూడ్డం, ధిక్కారం అన్నీ ధ్వనించాయి కాని పొరపడింది. తనఅందం, శక్తిని గ్రహించని స్త్రీ కాదన్నమాట! నేనన్నాను.

నీకళ్ళు నీ జీవితరహస్యాన్ని చెబుతున్నాయి. నాదగ్గర ఎందుకు అబద్ధాలు"

"దెబ్బతింది! మొహం కందిపోయినట్లై.

"పోనీలే! ఈ పతితురాలి గొడవ నీకెందుకు?" అంది కోపంగా. కోపంలో పొయ్యి జోరుగా విసరసాగింది. గంజిపొంగి పొయ్యిలోపడుతోంది.

"నామీద కోపమా? ఆ కథేదో కనుక్కుందామనే వొచ్చాను. అంతవరకు ఇక్కడినించి కదిలేదిలేదు" అన్నాను మొండిగా-

ఆశ్చర్యంగా చూసింది అన్నందింపుతూ-తరవాత చేపల పులుసును మరగ బెడుతోంది-

"లోకంలో వోనవ నిర్మాతలైన ఘోరాలు ఎన్నో ఉన్నాయి. వాటినన్నిటినీ చూస్తుంటే హృదయం తరుక్కుపోతుంది. కాని ఎవరుమాత్రం ఎంతవరకు ఏం చెయ్యగలరు? సానుభూతితప్ప! చాలామంది దగ్గర అదికూడా కరువే! కొందరు కావాలని మరీ కళ్ళుమూసుకుంటారు సత్యాన్ని చూడలేక- కళ్ళుమూసుకుని పాలుతాగే పిల్లిలాగా!"

అనాలోచితంగానే ఏవో అనసాగాను- పులుసువాసన చుట్టు ప్రక్కలి వాతావరణాన్ని ఘుమఘుమలాడిస్తోంది-

పొయ్యిమంట ఆమె చెక్కిళ్ళమీదపడి ప్రతిఫలిస్తోంది- మోకాళ్ళని చేతులతో కప్పుకొని ఇసికలో కూర్చున్న ఆమెకళ్ళనించి నీటిధారలు కారడం ఆ వెలుగులో స్పష్టంగా చూశాను-

"క్షమించండి! మిమ్మల్ని అర్థం చేసుకోలేకపోయాను" పశ్చాత్తాప్తస్వరంతో అంది. సన్నటివేలితో కళ్ళనీళ్ళు తుడుచుకుంది- మంట అదంతట అదే ఆరిపోసాగింది - పులుసు దింపింది.

"పాతజీవితాన్ని జ్ఞాపకంచేసి బాధించినందుకు క్షమించాలి- వెడతాను" అన్నాను లేస్తూ-

"నాబతుక్కి ఈ ఒక్క క్షణం చాలు, ఈ మాత్రం సానుభూతి లోకంలో ఎప్పుడో పొంది ఉంటే నాజీవితం ఇల్లా ఉండేదికాదు"

చెయ్యిపట్టుకుని "కష్టపెట్టానా" అంది కూచొమ్మన్నట్టు కిందికి లాగుతూ కూచునే-

మళ్ళాకూచున్నాను. "అందుకుకాదు, కష్టాన్ని రెచ్చగొట్టడం అవుతుందేమోనని" అంటూ-

చంద్రుడికేసి శూన్యదృష్టుల్ని ప్రసరించసాగింది. సానుభూతి నన్ను ముంచెత్తుతోంది. "పాపం" అనుకున్నాను- అంతకంటే మంచిమాట దొరకలేదు-

మాట్లాడసాగింది - "ప్రేమకి చోటులేదు. ప్రపంచంలో ఎవరికన్నా కావల్సింది - వాళ్ళ అవసరం తీరదంతే! తరువాత ఉపకారాన్నీ, స్నేహాన్నీ కూడా మర్చి గుడ్డివాళ్ళలాగానూ, చెవిటివాళ్ళగానూ, రాక్షసులగానూ, తయారవుతారు- నిజం! లేకపోతే... నేను ఏవేళ పుట్టానోగాని, నాజీవితమే అట్లా అయిందేమో?"

కాసేపు ఊరుకుని మళ్ళా అందుకుంది; "మీరు మొదట కథలు రాసేవాణ్ణన్నప్పుడు అంత నిర్లక్ష్యంగా మాట్లాడింది- కొంతవరకు ఆకథలే నన్నీదారుల్లోకి ఈడ్చాయనుకుంటాను- నేను చాలా కథలు చదివి వాటిల్లో ప్రేమనీ, జీవిత సౌఖ్యాలనీ ఎంతో గొప్పగాచిత్రిస్తారు. వాటితో ఉద్రేకినై జీవితంలో కాలుపెట్టేటప్పటికి వాస్తవికం వేరుగా కనపడింది- అంతా అబద్ధం అనిపించింది"

ఆమెభావాన్ని అర్థంచేసుకుందుకు మొహాన్ని పరిశోధిస్తూ చూడసాగాను-కదిపాను-

"అన్నం ఎంతసేపయిందోతిని- అభ్యంతరంలేకపోతే అన్నంతింటూ మాట్లాడవొచ్చు" అని-

ఎందుకో వింతగా నవ్వింది. వెన్నెల్లో పళ్ళన్నీ ముత్యాల్లా మెరిసాయి-

"ఆకలనేది ఎప్పుడో పోయింది. ఇప్పుడేదో బతకడంకోసం తింటున్నానంతే- ఈ వేళ ఈ సానుభూతి ఈ ప్రేమతో అసలు ఆకలే వెయ్యటంలేదు- ప్రతీవ్యక్తికీ జీవితంలో మరోమనిషి సన్నిహితత్వం తప్పనిసరైన అవసరం అనుకుంటాను. ప్రతీవాళ్లూ ఎప్పుడో ఒకప్పుడు తమ జీవితంలో అమితమైన వొంటరితనాన్ని అనుభవించినప్పుడు హృదయానికి

చేరదీసుకుని, మనసు దిద్ది మాట్లాడుకోగల మరోవ్యక్తి అవసరాన్ని గుర్తిస్తారనుకుంటాను- అదిలేనివాళ్లు మానవుల్ని మించినవాళ్లై వుండాలి"

లోపలికి వెళ్లి అల్యూమినియం కంచం తెచ్చుకుని గుమ్మందగ్గరగా కూచుని తినసాగింది- నేను దగ్గరగావెళ్లి, ఎత్తిపెట్టివున్న చింకినులకమంచం వాల్చుకుని, పట్టి వొదులనుకుని కూచున్నా నాలో ఏవో ఆలోచనలు ఎడతెగనివి రేగుతున్నాయి- ఆమె ముంగురులలో చల్లగాలి ఆడుకుంటోంది - మొహంలో ఎన్నో గొప్పలక్షణాలు కనిపిస్తున్నాయి- ఎంతో గొప్పవాళ్లు, కావలసిన వాళ్ళుకూడా ఒక్కొప్పుడు అవకాశాలులేకో, ఇతర దుర్భర పరిస్థితులవల్లో ఇలా పతనమౌతారుగావును అనుకున్నాను-

మధ్యన తినడంమాని, పెద్దకళ్ళలోనికి ఆకాశాన్ని చూస్తూ గత చరిత్ర తిరగ వేసుకుంటున్నట్టుంది; అనసాగింది-

ఆలోచిస్తుంటే అంతపూర్వజన్మలోని వృత్తాంతంలా వుంది- అసలులోపం ఎక్కడుందంటే నా విషయంలోమాత్రం నేడు మనలో సాధారణంగాజరిగే బాల్యవివాహాలవల్ల ననిపిస్తుంది- ఎందుకంటే మనదేశంలో చాలామందిలా నాకూ బాల్యంలోనే పెళ్లైంది - పెళ్లైనతర్వాత మళ్ళా నాలుగేళ్ళవరకూ భర్తని చూళ్లేదు - కాపరానికి వెళ్లినాడు చూశేనంతే! ఈ మధ్యకాలంలో ఎన్నో పుస్తకాలు చదివి ఎంతో విజ్ఞానాన్ని సంపాయించుకుని, భావిజీవితపు సౌఖ్యంకోసం నిరీక్షిస్తూ కాలంగడిపేను - ఆ ఆశలన్నీ అడుగంటి నాకు దుర్భరనిరాశ కలిగించి, ఆ కార్యం నాటిగదిలో భర్తని చూసినప్పుడే నేను ఈ మధ్యకాలంలో ఎంతో ఎదిగి పూర్తిగా స్త్రీనయ్యాను- కాని నాభర్త పెళ్లినాటికి ఎంతవున్నదో అంతే - ఆయనలో ఓర్పే లేకపోవడం, చిన్నపిల్లవాడిలా కనపడ్డంచూస్తే నన్ను నిలువునా నరికినట్టయింది! అప్పటి నా పరిస్థితి ఊహించుకోవడం నిలువునా ఎంతగా కుంగిందీ- చాలమందికి చాతకాదు- మంత్రాలతో ఆశీర్వదించే బ్రాహ్మలూ, పాటలుపాడే ముత్తైదువలూ వాళ్లపని ముగించుకువెళ్ళారు- కాని నా అవస్థ! దానితో పెళ్లికి పనిలేదు-

"ఆయనొక బడి పంతులు - కాపరానికి వెళ్లిన కొన్ని నెలలవరకూ జీవితం ఒకలా గడిచింది - ఎన్నాళ్లనించో ఆశించిన జీవితమాధుర్యం చవిచూడకుండనే- ఏదో బతుకొస్తున్నా నన్నామంటేగాని నా గుండెలలో మొదటిరోజునపడ్డ ఆశ నిపాతపుప్రధానం పోలేదు- కాని భారతదేశంలో పుట్టిన నాకు జీవితాన్ని బరువుగా గడపడం ఏమంత కష్టం అనిపించలేదు-

"కొన్నాళ్ళ తర్వాత తను ఏం చిన్నతనం భావించుకొన్నారోగాని ఆయనలో పూర్వంనుంచి ఉండే నిర్లక్ష్యంమాట అటుంచి, నన్ను తమబడిలో విద్యార్థిలా చూడసాగేరు. అదిచూస్తే నాకు భక్తి భయాలు ఎక్కువవడంకాని ఆయనంటే ఒకవిధమైన అసహ్యం కలగసాగింది. అయినా పెదవి కదపలేదు. నావిధిని భార్యగా నిర్వహించుకోసాగాను-

అదేరోజు జ్ఞాపకం లేదుగాని ఆయనతో ఒక పొడుగాటి, బలిష్ఠమైన విద్యార్థి వొచ్చాడు మాయింటికి– అతనిపేరు ఫిలిప్పుఅని వాళ్ళ మాటలినిబట్టి తెల్సుకున్నాను– అతని విగ్రహాన్ని చూడగానే నాలో ఎన్నాళ్ళనించో అణగిపడునని శక్తులన్నీ విజృంభించినట్టయింది. కొత్త సంతోషం మనన్యోనాని ఆక్రమించుకుంది–

"రోజూ ప్రైవేటుకోసం రాసాగాడు– ఆయన గమనించకుండా కిటికీ తెరలోంచి అతని ముఖభావాల్ని పరికించేదాన్ని– దానికి తర్వాత వొక్కవిమానం మోతమోగేది– ఒకటి రెండు సార్లు, అతనికి కావాలని కన్పడ్డానుకూడా– కోరచూపులతో నా అందాన్ని కొరుక్కు తినేవాడు–

"పరీక్షలముందు – అర్జంటు పనిమీద అతనితో చెప్పకుండానే ఆయన ఎక్కడికో వెళ్ళారు. అది తెలియక మామూలు వేళకి, రాత్రి ఎనిమిదికి చదువుకివొచ్చిన అతని పరిచయం పొందాలని నిశ్చయించుకున్నాను – మామూలుగా ముందుగదిలో దీపంవెలిగించి వొచ్చాను – అతను వొచ్చి చాపమీద కూచున్నాడు – అనుకున్న ప్రకారం శక్తినంతా వినియోగించి అందంగా అలంకరించుకొని ముందుగదిలోకి వెళ్ళాను; నన్ను చూడగానే నిశ్చేష్టుడై నిల్చున్నాడు, కంగారుతో. కళ్ళతో అతనిదృష్టుల్ని కట్టేస్తూనే వీధితలుపు వేశాను, హింసచేతితో చిక్కినట్టయింది; నాకు వేరేప్రపంచకం తెలీలేదు–

"కొంతసేపటి వరకూ అయోమయంగా ఉండిపోయాను– నేనే ప్రారంభోత్సవం చేశాను– నెమ్మదిగా చెయ్యపట్టుకుని, ముద్దు పెట్టుకోబోయాను! వెనక్కి తగ్గుతూ వెళ్ళి ఈజీచైర్‌లో పడ్డాను; నేనుకూడా పెదవుల్ని అనుసరించాను – ఒక్క తోపుతోసి వీధి తలుపుదగ్గరకు వెళ్ళాడు. నాకు గుడ్లలో నీళ్ళు తిరిగేయి; అయినా కూచుని అట్లానే అతనికేసి ప్రేమతో చూశాను, వీడని ఆశతో, అతని హృదయంలో నాకు సందుదొరికిందన్నమాట! ఇంతవరకూ అంతమౌనంగా జరిగింది. లేచివెళ్ళి గడ్డం పట్టుకుని 'ఒక్కసారి' అన్నాను మెల్లగా ఉద్రేకంతో ఉచ్ఛ్వాస నిశ్వాసలలో వూగే నావక్షంకేసి చూశాడు. అంతే! రెండు చేతులలోను నన్నుగట్టిగా అదిమిపట్టి 'నాకోలారు గని'అని బలంగా ముద్దుపెట్టుకున్నాడు–

'తెల్లారి లేచేటప్పటికి ముడతలుపడ్డ పక్క, వొడలిపోయిన మల్లెపూలు, నలిగిన శరీరం మిగిలాయి! రాత్రిపొందిన సంతోషం గుర్తుకొచ్చి, అలాగే జీవితాన్ని ముగిస్తే చాలనుకున్నాను. అలాజరిగినా బావుండేది!

"అదీకథ" ఇక ముగింపుకు వొచ్చింది. మొగవారిమాట ఏమోగాని, ఆడవాళ్లు ఒకసారి ఏ పరిస్థితులలో దారితప్పినప్పటికీ – ఇంక అంతే! వాళ్ళ జీవితం పతనమైనట్టే! ఒకసారి మనిషిమారితే? ఇంకవాళ్ళని పట్టగలిగిన వారుండరు. అదీ నా అనుభవం!

"ప్రస్తుత పరిస్థితిలోకి వారుకు వొచ్చానని అనుమానం మిమ్మలినింకా బాధించవచ్చు"

ఇక్కడ కొన్నిక్షణాలు ఆలోచిస్తూనే అన్నం తినసాగింది. నామనసు జాలితో నిండింది. మళ్ళా అంది.

కొన్నాళ్ళకి ఫిలిప్పుతో గడిపే రహస్యజీవితంమీద అసహ్యం కలిగింది. ఎక్కడికన్నా పోయి సుఖంగా గడుపుతే బాగుండుననిపించింది. అతను కూడా 'సరే' నన్నాడు. ఒకరోజురాత్రి అంతర్ధానమయ్యాం.

"అతనితో రెండునెల్లు ఏం సుఖపడ్డానో? జీవితంలో అవే మంచిరోజులు! కాని అతను తర్వాతచేసిన ద్రోహంచూస్తే అవికూడా పంచదార పూసిన చేదుమాత్ర లనిపించాయి.

"నాకు నెలతప్పడం సత్యాన్ని ఎదుర్కోలేని పితృత్వాన్ని ఆనందించ చాతకాని పిరికివాడూ, ప్రేమ విలువనీ ఇతరులత్యాగాన్నీ గుర్తించలేని ఆ ద్రోహీ, మూర్ఖుడూ, ప్రేమయిన ఫిలిప్పు నన్ను తన్ని నమ్ముకొని ప్రేమించేదాన్ని, జీవితాన్ని అంకితంచేసినదాన్ని, నిండుచూలాల్ని వొదిలి అంతర్ధానమయ్యాడు.

మరలా అతనిజాడ తెలియలేదు! అతనిపేరు తలుచుకుంటేనే వొళ్లు మండుకొస్తుంది.

ముందరే చెప్పానుకదూ. ఒకసారి సంఘంలో తన స్థానంనించి పతనమైన స్త్రీకి గౌరవం లేదు. మరలా ఆమె ఆచోటుకి రాలేదు, రానియ్యరు – ఆమెపతనానికి తగిన కారణాలని గురించి ఆలోచనలో వాళ్ళకి ప్రశక్తిలేదు.

ఏప్రేమని నమ్ముకుని సర్వాన్నీ త్యజించేనో ఆప్రేమే ద్రోహం చేసినప్పుడు నాకు జీవితంపైనే మమతపోయింది, పిచ్చెక్కినట్టయింది. నా తర్వాత జీవితం ఊహించుకోగలగడం మీకేమంత కష్టం లేదనుకుంటాను.

ఇక్కడ నిట్టూర్చింది. కళ్లు పెద్దవిచేసుకుని నాకేసి జాలిగా కొన్ని క్షణాలుచూసి పొంగివచ్చే దుఃఖాన్ని ఆపలేక పైకి ఏడవసాగింది– నాకేమీ తోచలేదు. నిశ్చేష్టుణ్ణై వింటున్నవాణ్ణి ఏదో విశ్వంలోంచి భూగోళం పరస్పరాక్షణ శక్తినించి తప్పి, అనంతంలో పడి పోతున్నట్టయింది. ఒక నిమిషంలో నన్ను నేనే గుర్తు తెచ్చుకొన్నా యందు నాకు సానుభూతి మాత్రం ఉందని గుర్తుంచుకో; అంతకంటె నిన్ను నేను ప్రార్థించేదిలేదు అని !

నాలుగు రోజులుపోయాక పేపర్లో చూసిన వార్త 'ఎవరో స్త్రీ రైలుకింద తలపెట్టి ఆత్మహత్య చేసుకుం'దని ఉంది!

అంతే ! ఆమె మరలా మార్కెట్‌లో కనపడలేదు; అక్కడికి పోయినప్పుడు మాత్రం ఆకళ్లు నా ఎదుటకనపడి కృతజ్ఞతతో నవ్వుతున్నట్టనిపిస్తుంది?

*14. 05. 1950–ఆనందవాణి వారపత్రిక*